విశాలాంధ్ర గుంటూరు జిల్లా

టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ ఫారంలు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులు ఆదివారం బీ ఫారంలు అందుకున్నారు. బీ ఫారమ్‌లు అందుకున్న వారిలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మంగళగిరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి నారా లోకేష్, పొన్నూరు నియోజకవర్గ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పిడుగు రాళ్ల మాధవి, ప్రత్తిపాడు నియోజకవర్గ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, తాడికొండ నియోజక వర్గ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి మహమ్మద్ నసీర్ అహ్మద్‌లు ఉన్నారు.

నేడు సుచరిత నామినేషన్

విశాలాంధ్ర-తాడికొండ : వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ అభ్యర్థి మేకతోటి సుచరిత సోమవారం తన నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గుంటూరు నగరంలోని నవభారత్ నగర్ నాలుగో లైన్ నుంచి తాడికొండ మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

26 లోపు ఫారం-12 అందించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తూర్పు నియోజకవర్గం(95) పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు వారి యొక్క ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నప్పటికిని, ఈ నెల 26వ తేదీలోపు జీఎంసీలోని పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్‌లో ఫారం-12 సంబందించిన వివరాలు అందించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం-12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపి తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

నా ఆలోచనలకు ప్రతి రూపమే అమరావతి ఉద్యమం

- పొలిటికల్ కన్సల్టెంట్ పోలవరపు రాకేష్ కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి : అమరావతి రైతుల ఉద్యమంలో తన ఆలో చనలను ఉపయోగించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనను పట్టించుకోవడం లేదని పొలిటికల్ కన్సల్టెంట్ రాకేష్ కుమార్ విమర్శించారు. మంగళగిరి నగరంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో రాకేష్ కుమార్ మాట్లాడుతూ రాజధాని రైతుల ఉద్యమం తన ఆలోచనకు ప్రతి రూపమన్నారు. తనను సంప్రదించకుండా ఉద్యమం చేపట్టారని పేర్కొంటూ రాకేష్ కుమార్ శనివారం రాత్రి మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్సీ అశోక్ కుమార్, పీఏ రాజగోపాల్‌లపై ఫిర్యాదు చేసిన విషయం విధితమే. అమరావతి ఉద్యమం జరిగే సమయంలోనే మీరు మీడియా ముందుకు ఎందుకు రాలేదంటూ విలేకరులు పలు ప్రశ్నలు అడుగగా రాకేష్ కుమార్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయారు.

చిలక విజయ్ ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర-తాడికొండ : తాడికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిలక విజయ్ కుమార్ ఆదివారం తాడికొండలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వ్యాపార సంస్థలు, దుకాణా లు, టీ స్టాల్స్ వద్ద ప్రచారం కొనసాగించారు. కరపత్రాలను పంపిణీ చేసి మేనిఫెస్టోను తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ అలీ, రహంతుల్లా, భాష, అడుసుమల్లి శ్రీనివాసరావు, సలీం పాల్గొన్నారు.

సమర్థుడైన పాలకుడు ఉంటేనే సుపరిపాలన

- మంగళగిరి ఎన్నికల ప్రచారంలో నారా బ్రాహ్మణి

విశాలాంధ్ర-మంగళగిరి : సమర్థుడైన పాలకుడు ఉంటేనే ప్రజలకు సుపరిపాలన అందుతుందని, గత అయిదేళ్లుగా రాష్ట్రంలో పాలన సాగిస్తున్న వారు మూడుముక్కలాటతో ప్రజల బతుకులను ఛిద్రం చేశా రని నారా బ్రాహ్మణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి రూరల్ బేతపూడి మల్లె తోటల్లో పనిచేస్తున్న మహిళా కూలీలను కలిసిన బ్రాహ్మణి వారి సాధకబాధకాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ ఒకప్పుడు రాళ్ల రప్పలతో నిండిన హైదరాబాద్‌ను హైటెక్ సిటీ నిర్మాణం ద్వారా విశ్వనగరంగా మార్చిన దార్శనికుడు చంద్రబాబునాయుడు అని, ఎల్లప్పుడూ ప్రజా క్షేమాన్ని కాంక్షించే చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి 53 రోజులపాటు అక్రమంగా జైలులో నిర్బంధించారన్నారు. కక్షపూరిత రాజకీయాలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇబ్బందుల్లో ఉన్న చేనేతలను ఆదుకునేందుకు నారా లోకేష్ టాటా తనేరియాతో ఒప్పందం చేసుకుని వీవర్స్‌శాలను ఏర్పాటు చేశారని, అధునాతన మగ్గాలు, డిజైన్లతోపాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి చేనేతల ఆదాయం పెంచేందుకు కృషిచేస్తున్నారని చెప్పారు. లోకేష్ విజన్ అమలైతే మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం దేశంలోనే నెంబర్ 1గా తయారవుతుందని నారా బ్రాహ్మణి తెలిపారు.

6వ సచివాలయ పరిధిలో వైసీపీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి 6వ సచివాలయ పరిధిలో ఆదివారం సాయంత్రం వైసీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి ఆధ్వర్యంలో బూత్ నెంబర్ 45లో బూత్ కన్వీనర్ ఉప్పు శ్రీను, వేముల కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ వేముల లక్ష్మీ రోజా సారధ్య ంలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యకి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షులు ముది గొండ ప్రకాష్, కూరగంటి ఉదయ రాజు, బత్తుల వెంకటేశ్వరావు, గుంజ అంబారావు, కొండ, మైల రవీంద్ర, డి.శ్రీకాంత్, బీవీ రావు, వి.వెంకయ్య, వి.అంజి, నారాయణ, భవాని, శంకర్, కృష్ణారెడ్డి, కె.వంశీ, టి.సాయి, కీర్తి, చింటూ, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

23న 'ఉచిత పుస్తక పంపిణీ'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఈ నెల 23వ తేదీ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ధార్మిక విజ్ఞాన ప్రాంగణం ఆవరణలో 'ఉచిత పుస్తక పంపిణీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకులు లంకా సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య, భారత ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణలు ప్రారంభిస్తారని, పాఠకులు, పుస్తక ప్రియులు తమ వద్ద ఉన్న విలువైన చదివిన పుస్తకాలను మరొకరు చదివేందుకు ఈ పుస్తక పంపిణీ కార్యక్రమంలో అందజేసి వారికి కావలసిన పుస్తకాలను ఉచితంగా పొందవచ్చున్నారు. ఈ పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎన్నికల ప్రచారంలో నాదెండ్ల సతీమణి

విశాలాంధ్ర-తెనాలి : జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటి చైర్మన్, తెనాలి అసెంబ్లీ నియోజక వర్గ జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ నాదెండ్ల మనోహరం ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పట్టణంలోని 10 వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొని జనసేన, తెలుగుదేశం, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు తమ ఓటు వేయాలని కోరారు. వర్దిల్లాలి జనసేన తెలుగుదేశం బీజేపీ పార్టీల ఐక్యత అని నినదించారు. నాజరుపేటలోని సంకా వారి కొట్ల బజారు రంగా బొమ్మ వద్ద ప్రారంభమైన ప్రచార కార్యక్రమం పుట్టా రాఘవయ్య రైస్ మిల్ వద్ద ముగించారు. సాయంత్రం మండలంలోని జాకీర్ హుస్సేన్ నగర్, హాఫ్‌పేట గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో వైఎస్ షర్మిల బహిరంగ సభ

విశాలాంధ్ర- తెనాలి : ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 23వ తేదీ సాయంత్రం 7 గంటలకు తెనాలి మార్కెట్ సెంటర్ నుండు బహిరంగ సభ జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ డాక్టర్ చందు సాంబశివరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు ఆదివారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, మండల అధ్యక్షుడు కర్లపూడి బుల్లియ్య, కొల్లిపర మండల అధ్యక్షుడు సిద్దల రామకృష్ణ, బీసీ సెల్ అధ్యక్షుడు పున్నారావు, మండల కో-ఆర్డినేటర్ మల్లవరపు ప్రసాద్, పి.శివకుమార్, కె.కోటేశ్వరరావు, భీమా రమేష్, సీహెచ్ అయ్యప్ప, కె.సుబ్బా రావు, వై.శంకరరావు, షేక్ నాగూర్, కార్తీక్, బడుగు శ్రీను, యన్.మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరు ఎన్ని బెదిరించినా అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నాం

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్ర రాష్ట్ర సమితి అభ్యర్థులను నామినేషన్లు వేయ కుండా ప్రధాన పార్టీల నాయకులు అడ్డుకుంటున్నారని, ఎవరు ఎన్ని బెదిరించినా అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఆంధ్ర రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి జంజనం కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆంధ్ర రాష్ట్ర సమితి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదవాడి గుండె చప్పుడు ఆంధ్ర రాష్ట్ర సమితి ప్రధాన ఎజెండాగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను దఫల వారిగా ముఖ్యమంత్రిని చేయడమే తమ ధ్యేయ మన్నారు. గుంటూరు మంగళగిరి, తాడేపల్లి, విజయవాడలను గ్రేటర్ అమరావతిగా చేస్తానని తెలిపారు. వలంటరీ వ్యవస్థను పర్మినెంట్ చేస్తానని చెప్పారు. ప్రజలందరికీ ఉచిత వైద్య సేవలను అందిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశామని తెలిపారు. కొన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

విజ్ఞాన్ హైస్కూల్‌లో ఘనంగా పట్టభద్రుల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు పట్టణం ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో 'కాన్వకేషన్' వేడుకలను శనివారం రాత్రి అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగరంలోని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జి.ధనుంజయరావు, సైకాలజిస్టు డాక్టర్ శ్రీరమ్య హాజరయ్యారు. యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించి ప్రశంసా పత్రాలను విద్యార్థులకు గౌరవ అతిథుల చేతుల మీదుగా అందజేశారు. డాక్టర్ ధనుంజయరావు మాట్లా డుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు అన్ని వసతులను సమకూర్చడమే కాకవారు చదివేటప్పుడు ఏమి చదవుతున్నారు? టీవీ చూసేట ప్పుడు వారు ఎటువంటి కార్యక్రమాలను చూస్తున్నారో ఒకవైపు గమ నిస్తూ ఉండాలన్నారు. సైకాలజిస్టు డాక్టర్ శ్రీరమ్య మాట్లాడుతూ సమాజానికి మంచి పౌరులను తయారు చేసి అందించే బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందని, విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రులు, ఉపాధ్యా యుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్స్ జోనల్ ఇన్‌ఛార్జ్ అనురాధ, ప్రిన్సిపల్ సీహెచ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ సేవకుమార్ నామినేషన్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ టి.సేవ కుమార్ సోమవారం (22వ తేదీన నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు ఆ పార్టీ అభ్యర్థి డాక్టర్ సేవకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి పార్టీ వ్యవస్థాపకులు, అధ్యక్షులు పెళ్ళకూరి సురేందర్ రెడ్డి, పార్టీ సలహాదారులు జై ఆంధ్ర మహాదేవ్ జీఎస్ఎస్‌వీ ప్రసాద్, పి.నిర్మల రాణి తదితరులు పాల్గొంటారన్నారు. జీరో బడ్జెట్ పాలిటిక్స్‌తో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి ప్రజల ముందుకు వస్తున్నానని, దీంతో ప్రజలు ఈసారి తప్పక గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు కసరత్తు

- సమస్యాత్మక ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు

విశాలాంధ్ర-మంగళగిరి : రాజధాని నియోజకవర్గమైన మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ప్రధాన రహదారి అయిన గౌతమ బుద్ధ రోడ్డును విస్తరించినప్పటికీ, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రధాన కూడళ్లలో వేగ నియంత్రణకు బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ, ప్రజలు తీవ్ర గాయాల పాలవుతున్నారు. పలు సందర్భాల్లో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రమాదాలను నివారించాలంటే వేగ నియంత్రణను అదుపు చేయాల్సిన అవసరం ఉందని పోలీసులు గుర్తించారు. ఇందుకు మంగళగిరి అర్బన్ సీఐ ఎం.శ్రీనివాసరావు వేగ నియం త్రణ(జిగ్ జాగ్) బోర్డులను ఏర్పాటు చేస్తే మేలని భావించారు. ఓ ప్రక్క సార్వత్రిక ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ కొత్త బోర్డులను తెప్పించి దాతల సహకారంతో వాటిని సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న కూడళ్ళలో ఈ బోర్డులను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల వేగాన్ని నియంత్రించవచ్చునని తద్వారా ప్రమాదాలను అదుపు చేయవచ్చని ఆయన భావిస్తున్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో త్వరలో బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రమాదాలను నివారించడం, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడమే లక్ష్యం అని పేర్కొన్నారు.

చరిత్రలో నిలిచేలా పెమ్మసాని చంద్రశేఖర్ నామినేషన్

విశాలాంధ్ర-గుంటూరు : గతంలో ఎన్నడూలేని విధంగా నభూతో నభవిష్యత్ అనే రీతిలో చరిత్రలో నిలిచేలా ఎన్డీయే కూటమి బలపరిచిన టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నామినేషన్ కార్యక్రమం జరగనుందని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. సోమవారం పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటూ గుంటూరు అసెంబ్లీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నసీర్ అహ్మద్ నామినేషన్ వేయనున్న నేపథ్యంలో ప్రజలు తమ నిండైన ఆశీస్సులు అందించాలని కోరారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా సాగుతున్న క్షుద్ర పాలన అంతానికి తొలి అడుగు వేస్తున్న కూటమి అభ్యర్థులకు బాసటగా ప్రతిఒక్కరూ నిలవాలని అభిలాషించారు. నవశఖానికి ఆలంబనగా, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం జరుగుతున్న మహాసంగ్రామంలో ప్రజలే సైనికులుగా పోరాడాలని కోరారు. రాష్ట్ర ప్రజల కోసం, సమాజ, ప్రజాస్వామ్య సంక్షేమ సారధులంతా ఏకతాటిపైకి రావాల్సిన చారిత్రాత్మక సమయం ఆసన్నమైందని ఆళ్ళ హరి అన్నారు.

యువతను మోసగించిన జగన్

విశాలాంధ్ర-గుంటూరు : అందరికి ఉద్యోగాలు అంటూ యువతను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మోసగించారని గుంటూరు తూర్పు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్ మండిపడ్డారు. ఆదివారం 2వ డివిజన్ పరమాయకుంటలో లాయర్ ఉమర్ అలీ ఆధ్వర్యంలో ఆరిఫ్, ముకేష్, విజయ్ బాబు, ఉప్పతల రాజు తదితరులు 80 మంది వైసీపీ యువకులు టీడీపీలో చేరారు. వారికి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించకపోవటంతో అనేకమంది వలస బాటపట్టారన్నారు. నకిలీ ఇళ్ల పట్టాలతో మహిళలను మోసగించారని, జగన్ చేసిన హామీలు, వాగ్దానాలు బుట్టదాఖలు చేసారాని పేర్కొన్నారు. ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక సాయన్ని మరిచాడని, కరెంట్ బిల్లు మోత మోగించాడని దుయ్యబట్టారు. స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా తూర్పు నియోజకవర్గానికి చేసిందేమిలేదని, తన సొంత వ్యాపారాలకే పరిమితమా య్యాడని విమర్శించారు. అదేవిధంగా 12, 13, 4 డివిజన్లకు చెందిన వైసీపీ ముస్లిం యువకులు జఫ్రుల్లా, నజీర్ ఆధ్వర్యంలో 100 మంది టీడీపీ తీర్ధం పుచ్చుకున్నారు. వారిని మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, టీడీపీ నాయకులు భరత్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్ తదితరులు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వేల్చూరి కిరణ్, వెంకట రమణ, దుర్గాప్రసాద్, కొల్లా శ్రీను, కన్నా, పాల్గొన్నారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటల నుంచి నామినేషన్ కార్యక్రమం ప్రారంభం కానుందని, స్టేడియం వద్ద నుంచి కార్పొరేషన్ వరకు భారీ ర్యాలీతో వెళ్లనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నేడు నామినేషన్‌ను జయప్రదం చేయండి

- బహిరంగ సభకు హాజరుకానున్న బీవీ రాఘవులు, ముప్పాళ్ల, ఈశ్వరరావు
- మంగళగిరి అసెంబ్లీ సీపీఎం అభ్యర్థి జొన్న శివశంకర్

విశాలాంధ్ర-తాడేపల్లి : కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరచిన మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తాను ఈ నెల 22వ తేదిన ఉదయం 10 గంటలకు నామినేషన్ వేయనున్నట్లు అభ్యర్థి జొన్న శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా పేద ప్రజల సమస్యలు పరిష్కారం కావడంలేదని ప్రజలకు మేలు జరగాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. నియోజకవర్గంలో పేదల సమస్యలు పరిష్కారం కావాలన్నా ఇళ్ళ పట్టాలు ఇవ్వాలన్న ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ అయిన తర్వాత డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వామపక్ష పార్టీల పాత్ర కీలకమైందన్నారు. తాడేపల్లిలో హిందువులకు, క్రిస్టియన్లకు, ముస్లింలకు స్మశాన వాటికలు లేవని, స్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దర్శనపు శ్యామ్యూల్, సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇండియా కూటమి బలపరిచిన సీపీఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌ను కంకి, కొడవలి గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని, అలాగే మంగళగిరి అసెంబ్లీకి ఇండియా కూటమి బలపరిచిన సీపీఎం అభ్యర్థి జొన్న శివశంకర్‌ను సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. 22న ఉదయం 10 గంటలకు మంగళగిరి పట్టణంలోని చిల్లపల్లి కళ్యాణ మండపంలో బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు హాజరవుతారని తెలిపారు. సభ అనంతరం ఆంజనేయ స్వామి టెంపుల్, మిద్దే సెంటర్, గాలిగోపురం, గౌతమ్ బుద్ధ రోడ్డు మీదుగా ప్రదర్శనగా వెళ్లి జొన్న శివశంకర్ నామినేషన్ వేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సోలా ముత్యాలరావు, చింత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బీ ఫారం అందుకున్న నారా లోకేష్

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఉండవల్లి నివాసంలో మంగళగిరి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కి బీ ఫారమ్ అందజేశారు.

అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించిన చంద్రబాబు

తాడేపల్లి : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు బీ ఫారంలు అందించారు. ఉండవల్లిలోని తన నివాసంలో బీ ఫారాలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి మొదలు పెట్టి అభ్యర్థులకు బీ ఫారాలు అందించారు. తెలుగు దేశం పార్టీ శాసన సభ/ పార్లమెంటు అభ్యర్థిగా ఎంపికైన నేను పార్టీ ఆశయాలకు, సిద్ధాంతాలకు, నిర్ణయాలకు ఎల్లవేళలా కట్టు బడి ఉంటానని, పార్టీకి విధేయతతో, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. నాకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన తెలుగుదేశం పార్టీ సాక్షిగా నీతినిజాయితీతో, నిరాడంబరంగా ప్రజా సేవకు అంకితమౌతాను. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నైతిక విలువలతో, కుల, మతవర్గాలకు అతీతంగా సర్వవర్గ సంక్షేమానికి, ఆదర్శ వంతమైన సమాజం కోసం కృషి చేస్తాను. ప్రజా తీర్పు ద్వారా నాకు సంక్రమించే పదవిని బాధ్యతాయుతంగా స్వీకరించి, దేశ, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేస్తాను. స్వర్గీయ ఎన్టీ రామారావు ఆశయ సాధనకు పాటు పడుతూ, తెలుగు వారి ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తాను. నేడు విధ్వంసమైన మన రాష్ట్రాన్ని పునర్ నిర్మించుకోవడంలో భాగస్వామిని అవుతాను. ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు, ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తాను. ప్రజల సంక్షేమం కోసం, రాష్ట్ర శ్రేయస్సు కోసం అవిశ్రాంతంగా మనసా, వాచా, కర్మేణా కృషి చేస్తానని మనస్సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అని ప్రతిజ్ఞ చేయించారు.

కేంద్రం విడుదల చేసిన నిధులు ప్రభుత్వం నేటి వరకు జమ చేయలేదు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.998.82 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసి 20 రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నేటి వరకు కూడా స్థానిక సంస్థలకు జమ చేయాలేదని అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ పంచాయితీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఆదివారం ఒక ప్రకట నలో ఆరోపించారు. ఈ విషయంపై ఈ నెల 12వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో స్పందించిన ముఖేష్ కుమార్ మీనా శనివారం ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేసి తక్షణమే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరించి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు జాస్తి వీరాంజనేయులు వెల్లడించారు.

అనారోగ్యపు ఆహారపు అలవాట్లే గుండె సంబంధిత వ్యాధులకు కారణం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అనారోగ్యపు ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, వ్యాయామం లేని జీవితమే గుండె సంబంధిత వ్యాధులకు కారణమని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'గుండె జబ్బులకు గురి చేస్తున్న అనారోగ్యపు అలవాట్లు-తీసుకునే ఆహారం'అనే అంశంపై ఆదివారం ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులు ఇంతకు ముందు రోజుల్లో పెద్ద వయస్సు వారికే మాత్రమే ఎక్కువగా వచ్చేవని, కానీ ఇప్పుడు చిన్న వయస్సు వారిలో..యువతలో కూడా గుండె సంబంధిత వ్యాధులు చూస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అనారోగ్యపు ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, వ్యాయామం లేని జీవితం వల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తున్న నేపథ్యంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ మానసిక ఒత్తిడిని తగ్గించే దిశగా జీవనం సాగిస్తూ కనీసం రోజుకు ఒక అరగంట వ్యాయామం ఉండేవ ఇధంగా చూసుకోవాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో మన చుట్టూ ఉండే విధంగా చూసుకుంటూ మంచి ఆలోచనలను చేస్తూ మంచి మార్గంలో పయనిస్తూ ఒత్తిడికి గురి కాకుండా ఉంటే చాలా అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. గుండె జబ్బులకు గురికాకుండా ఉండాలంటే ముఖ్యంగా బీపీ, మధుమేహం, థైరాయిడ్ లాంటి వాటిని అదుపులో ఉంచుకుంటూ రక్తంలో కొలెస్ట్రాల్ శాతాన్ని అదుపులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. బీపీ, రక్తపోటు వల్ల కళ్ళకు, గుండెకు, మూత్రపిండాలకు, మెదడుకు సంబంధించిన సమస్యలు తలెత్తుతా యన్నారు. రక్తపోటును అదుపులో ఉంచుకోవాలంటే ముఖ్యంగా బరువును తగ్గించుకోవడం, తాజా పండ్లను..తక్కువగా కొవ్వుశాతం కలిగిన పాల ఉత్పత్తులను తీసుకోవడం, ఆహారంలో ఉప్పును తగ్గించి తీసుకోవడం, ఆయాసం కళ్లు తిరగడం, నీరసం, ఛాతిలో బరువుగా ఉండటం, ఛాతినొప్పిగా ఉండటం ఇవన్నీ హార్ట్ ఎటాక్ లక్షణాలని పేర్కొన్నారు. ఎప్పుడైనా ఇటువంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే దగ్గరలో ఉన్న గుండె సంబంధిత డాక్టర్లను సంప్రదించి ఈసీజీ తీయించుకోవడం ఉత్తమం అని అన్నారు. ఈ కార్రక్రమానికి టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, కొండా శివరామిరెడ్డి, ఆర్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏ రంగంలోనైనా విజయం సాధించగలిగేది మహిళలదే

విశాలాంధ్ర-మంగళగిరి : స్త్రీ శక్తి లేకపోతే ఈ సృష్టి లేదని నారా బ్రాహ్మణి అన్నారు. మహిళలు ఏ రంగంలో అడుగుపెట్టినా విజయం సాధించడం ఖాయమన్నారు. ఎన్ని కల ప్రచారంలో భాగంగా మంగళగిరి విటిజెఎస్ డిగ్రీ కళాశాల ఫంక్షన్ హాలు లో స్త్రీశక్తి లబ్దిదారులు, మహిళా మిత్ర, డ్వాక్రా గ్రూపు మహిళలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణి మాట్లాడుతూ ఎన్టీఆర్ మహి ళల కోసం ఎంతో చేశారని, మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారని, స్థానిక సంస్థల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించినట్లు చెప్పారు. రాష్ట్రంలో మొట్టమొదటగా పద్మావతి మహిళా యూనివర్సిటీ స్థాపించారని, గత చంద్రబాబు ప్రభుత్వంలో ఏనాడు కరెంటు ఛార్జీలు పెంచలేదని, నియోజక వర్గంలో అన్ని సమస్యలు పరిష్కరించి దేశంలోనే నెం.1గా మంగళగిరిని నిలపాలన్న లోకేష్ సంకల్పం, ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నారా బ్రాహ్మణి విజ్ఞప్తిచేశారు. బ్రాహ్మణి ఎదుట పలువురు స్త్రీశక్తి లబ్దిదారులు తమ మనోభావాలను పంచుకున్నారు. భారతి అనే మహిళ మాట్లాడుతూ స్త్రీ శక్తి ద్వారా చేపట్టిన కార్యక్రమాలు మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతు న్నాయని, దూర ప్రాంతాల నుంచి కూడా మహిళలు వచ్చి కుట్టుశిక్షణ తీసుకొని నేర్చుకుని వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. కుటుంబానికి మా వంతు సాయంగా నిలిచేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడ్డాయ న్నారు. స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా నారా లోకేష్ మహిళలకు కుట్టుశిక్షణ, బ్యుటీషియన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుచేశారని తెలుసుకుని సంతోషించా. నేను టైలరింగ్ నేర్చుకుని నా కల సాకారం చేసుకున్నానని చెప్పారు.

వైసీపీ వచ్చాక డ్వాక్రా మహిళలపై చిన్నచూపు : వాసంతి మాట్లాడుతూ 1995లో మేం డ్వాక్రా సంఘం పెట్టినప్పుడు యూనిట్లు అన్నీ బాగా విజయవంతంగా నడిచాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక డ్వాక్రా మహిళలను చిన్నచూపు చూస్తున్నారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. నారా లోకేష్ ఎక్కువ సమయం మంగళగిరి నియోజకవర్గానికి కేటాయిస్తున్నారు. కుటుంబ సభ్యులకంటే ఇక్కడి ప్రజలను ఎక్కువగా ప్రేమిస్తారు. రాబోయే ఎన్నికల్లో లోకేష్ ను ఆశీర్వదించాలని కోరారు.

వాసవి మాత కరుణతోనే సేవా కార్యక్రమాలు

- మద్దు రామకృష్ణయ్య ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామకృష్ణయ్య

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కుల దైవం వాసవి మాత కృపతో వ్యాపార రంగంలో తాము ఆర్జించిన లాభాల నుంచి పేదలను, వృద్ధులను సేవా కార్యక్రమాలు ద్వారా ఆదుకుంటున్నట్టు మద్దు రామకృష్ణయ్య ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మద్దు రామకృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక చుట్టుకుంట లీలా గాయత్రి కోల్డ్ స్టోరేజ్ ప్రాంగణంలో 250 మంది వృద్ధులకు రూ.1200 చొప్పున మూడు నెలల పింఛను.. మూడు లక్షల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పేద వృద్ధులకు, వికలాంగులకు, విద్యార్థులకు, మహిళలకు వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎం.జయలక్ష్మి, భావన్నారాయణ, శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వైసీపీలోకి 20 కుటుంబాలు చేరిక

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ పట్టణంలోని 22, 23 వార్డు తెలుగుదేశం పార్టీ కి చెందిన 20 కుటుంబాలు ఆదివారం వైసీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వినుకొండలో జరుగుతున్న అభివృద్ధి ని చూసి ఆకర్షితులై నేడు పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, వైసీపీ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థి అయినా జీవి ఆంజనేయులుకి ఓటమి భయం ఏర్పడిందని, అందుకే ప్రతి చోట తాను చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక ప్రభుత్వం పై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజలు పూర్తి అవగాహనతో ఉన్నారు. ప్రజలు వాటిని గమనించి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వైయస్సార్ కాంగ్రెసు పార్టీ వారి ఓట్లతో గెలిచి ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్న లావుకు విలువలు లేవని అన్నారు. అలాంటి విలువ లేని వ్యక్తి ఇప్పుడు నీతి వాక్యాలు వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు.

నామినేషన్‌కి అందరూ తరలిరండి : స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మరో సారి నేను నామినేషన్ వేస్తున్న తరుణంలో సోమవారం ఉదయం 10 గంటలకు కారంపూడి రోడ్‌లోని బ్రహ్మనాయుడు కళ్యాణ మండపం వద్ద నుండి భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేయనున్నానని ఈ నామినేషన్‌కి నియోజకవర్గంలోని అన్ని మండలాల వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు, కార్యకర్తలు వచ్చి తమ మద్దత్తును తెలియజేయాలని కోరారు.

స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా బోయపాటి

విశాలాంధ్ర-పెదకాకాని : మండల కేంద్రమైన పెదకాకాని గ్రామానికి చెందిన బోయపాటి వెంకట రమణ శనివారం గుంటూరు పార్లమెంట్ స్వతంత్ర అభ్య ర్థిగా నామినేషన్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివారం పెదకాకానిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర ఖాది బోర్డు సభ్యునిగా పలు పదవులు నిర్వహించి ఇటీవల కాలంలో టీడీపీకి రాజీనామా చేయడం జరిగిందన్నారు. 2026 అసెంబ్లీ నియోజకవర్గ పునర్విభజనలో పెదకాకానిని నియోజకవర్గం చేయడం కోసం తన వంతు ప్రయత్నం చేస్తున్నానని, దీనికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు అవసరమని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగటం జరిగిందన్నారు.

పేదరిక నిర్మూలనే వైసీపీ లక్ష్యం

విశాలాంధ్ర-రెంటచింతల : రాష్ట్రంలోని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగుతుందని మాచర్ల నియోజక వర్గ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాతృమూర్తి రాములమ్మ, సోదరి నాగమణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని మంచికల్లు, పాలువాయి గేట్ గ్రామాలలో వారు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో నాడు-నేడు కింద సమూల మార్పులు తీసుకువచ్చిన ఘనత ఒక్క జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. అదేవిధంగా దేశ చరిత్రలో ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసి, మీ ఇంట్లో మంచి జరిగివుంటేనే ఓటు వేయండని అడిగే వ్యక్తిని ఎప్పుడైనా, ఎక్కడైనా చూసారా అని ప్రశ్నించారు. మాచర్ల నియోజక వర్గంలో అభి వృద్ధి పనులు వేగవంతంగా జరిగాయన్నారు. రాజకీయాలకు, కులమతాల కతీతంగా సంక్షేమ ఫలాలు అందజేయడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షే మాన్ని చూసి రాబోయే ఎన్నికల్లో పిన్నెల్లి కుటుంబానికి అండగా నిలిచి ఎమ్మె ల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా అనిల్ కుమార్ యాదవ్‌ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో వారి వెంట వైసీపీ జిల్లా నాయకులు పూజల రామయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మోర్తల ఉమా, ఎంపీపీ సంపూర్ణమ్మ, మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కర్‌రెడ్డి, మంచికల్లు సర్పంచ్ పొట్లపాటి చంద్రా రెడ్డి, గొలమారి శ్రీనివాస రెడ్డి, చింతా సుబ్బారావు, నారాయణ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర-బెల్లంకొండ : గడిచిన ఐదేళ్ల పాలనలో అంధకారంలోకి వెళ్లిపోయిన రాష్ట్ర భవిష్యత్తును తిరిగి గాడిలో పెట్టడానికి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం లక్ష్యంగా పని చేయాలని నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి రాణి రుద్రమదేవి అన్నారు. బెల్లంకొండ మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం ఇంటింటికి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొని సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని ఆమె అభ్యర్థించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఒక్క బీజేపీ, జనసేన, టీడీపీ కార్యకర్తలు, నాయకులు, టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏ విధంగా మంచి జరుగు తుందో వివరించి చెప్పాలన్నారు. మీ పిల్లల భవిష్యత్తు కోసం చంద్రబాబుని మళ్లీ సీఎం చేయాలని, పేద బడుగు బలహీనవర్గాల వారికి యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి రైతుకు ఏట రూ.20వేలు ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తెలుగుదేశం పార్టీ గెలుపుతో సాధ్యమవుతుందన్నారు. నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలను, పెదకూరపాడు శాసనసభ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కిచ్చారెడ్డి, రామకృష్ణ, రాఘవరెడ్డి, కుంచాల రాజు, ఓర్చు ఆనంద్, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో మూడు షాపులు దగ్ధం



విశాలాంధ్ర-యడ్లపాడు: యడ్లపాడు వంకాయలపాడు గ్రామాల నడుమ 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన ఆయిల్ బంక్ సమీపంలో గల ఒక హోటల్, 2 కొట్లు ఆదివారం అగ్నికి ఆహుతి అయ్యాయి. రూ.4 నుంచి రూ.5 లక్షల ఆస్తి నష్టపోయినట్లు ఆయా బాధితులు వాపోతున్నారు. వెనుక నున్న జామాయిల్ తోటల నుండి మంటలు వచ్చినట్లు భావిస్తున్నారు. కాగా ఆ సమయం లో 3 కొట్లు మూసివేసి వున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో గ్యాస్ సిలిండర్ పేలి జాతీయ రహదారిపై పడటంతో పలువురు ఆందోళనకు గురైనారు. గాలికి మంటలు జామాయల్ తోటలలో వ్యాపించాయి. చిలకలూరి పేట నుండి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చెయటానికి ప్రయతించిది. ఎవరో ఆకతాయిలు తోటలలో చేసిన పని ఫలితంగా ప్రమాదం సంభవించి నట్లు భావిస్తున్నారు. మంటలకు రహదారి ప్రక్కనే గల పలు నెట్లకు చెందిన వైర్లు కాలిపోయి నెట్ లకు అంతరాయం కలిగింది. కాగా సమీపంలో పెట్రోల్ బంక్ వుండటతో పలువురు ఆందోళనకు గురైనారు. ప్రొద్దు పోయేవరకు తోటలలో మంటలు కొనసాగాయి.

ఐక్యంగా పనిచేస్తున్నాం శ్రేణులకు భరోసా ఇస్తున్నాం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : కూటమి మూకుమ్మడిగా అడ్డుకున్నా, ఎన్ని కుట్రలు పన్నినా సత్తెనపల్లిలో వైసీపీ జెండానే ఎగిరేదని, అంబటి రాంబాబుదే గెలుపని నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం సత్తెనపల్లి నియోజకవర్గ కార్యాల యంలో మంత్రి అంబటితో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనిల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముఖ్యనేతలు కలిసికట్టుగా ఒకే తాటిపైకి వచ్చి అంబటి రాంబాబు గెలుపు కోసం పనిచేయటానికి సిద్ధపడటం స్ఫూర్తిదాయకం అన్నారు. నియోజక వర్గాన్ని కంచుకోటగా మార్చేందుకు కష్టపడి పనిచేయాల న్నారు. మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవ డమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ నెల 24వ తేదీన నరసరావు పేటలో నేను నామినేషన్ వేస్తున్నానని, ఈ కార్యక్ర మంలో మీరు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి అంబటి రాంబాబు మాట్లాడుతూ అసంతృప్తులకు, గుసగుసలకు, ప్రాపగండకు తెర దించుతూ ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో నాకు టికెట్ రాదని, వేరే బయట నుంచి వస్తున్నారని, కొంతమంది పార్టీ కోసం పనిచేయకుండా దూరంగా ఉంటున్నారని గ్లోబల్ ప్రచారానికి ముగింపు పలుకుతూ ఐక్యంగా ఉన్నామనే సంకేతాన్ని శ్రేణులకు ఇస్తున్నామ న్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి అందరూ పనిచేయాల్సిం దేనని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చేందుకు ఎన్ని కుట్రలు అయినా పన్నుతాడన్నారు. హింసను ప్రేరేపిస్తాడన్నారు. బాబు గెలిచేది లేదు అసెంబ్లీకి వచ్చేది లేదన్నారు. రాళ్లు తగిలినా ముందుకు సాగుతున్న నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అని, పూలు చల్లుతుంటే వద్దనే వ్యక్తి పవన్ అని, ప్రజలకు ఎవరు అసవరమో తేల్చుకోవాలని, పవన్‌పై అంబటి తనదైన శైలిలో సెటైర్లు వేశారు. రెండు రోజులు పర్యటించి నాలుగు రోజులు జ్వరం అంటారని, పవన్ రాజకీయాలకు పనికిరాదని అన్నారు. ఈ నెల 24వ తేదీన నరసరావుపేటలో పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, సత్తెనపల్లిలో నేను నామినేషన్ దాఖలు చేస్తున్నామని, భారీ స్థాయిలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పూర్వ శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వరరెడ్డి, పర్యావరణ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బ చంద్రశేఖర్, పూర్వ గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్ రెడ్డి, పల్నాడు జిల్లా వైద్య విభాగం కన్వీనర్ గజ్జల నాగభూషణ్ రెడ్డిలు ప్రసంగించారు. సమావేశంలో గుంటూరు ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు పదాల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చేతుల మీదుగా బీ ఫారాలు అందజేత

బీ ఫారం అందుకున్న లావు శ్రీకృష్ణదేవరాయలు

విశాలాంధ్ర-నరసరావుపేట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉండవల్లిలో ఉమ్మడి కూటమి నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు బీఫారం పట్టా అందుకున్నారు.

బీ ఫారం అందుకున్న 'కన్నా'

సత్తెనపల్లి : పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా కన్నా లక్ష్మీనారాయణ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉండవల్లిలో బీ ఫారం పట్టా అందుకున్నారు. సోమవారం మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. నియోజకవర్గ స్థాయిలో భారీ జనసమీకరణకు నాయకులు ఇప్పటికే కార్యాచరణ పూర్తి చేశారు.

బీ ఫారం అందుకున్న భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఆదివారం మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా బి ఫారం అందుకున్నట్టు భాష్యం ప్రవీణ్ ఆదివారం తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నియమించినందుకు జన్మజన్మలకు చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉంటాను అని తెలిపారు.

బీ ఫాం అందుకున్న యరపతినేని

గురజాల: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా గురజాల నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు బీ ఫాం అందుకున్నారు. బీ ఫాం అందుకున్న యరపతి నేని చంద్రబాబు సమక్షంలో ఈసారి ఖచ్చితంగా గెలిచి రానున్న రోజుల్లో అభివృద్ధిలో వెనుకబడిన గురజాలను మళ్ళీ అభివృద్ధి పథంలోకి నడిపేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చంద్రబాబు చేతుల మీదుగా బీఫారం అందుకున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ : తనపై అచంచల నమ్మకంతో వరసగా 4వ సారి వినుకొండ నుంచి పోటీచేసే అవకాశం ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకి ఎప్పటికీ రుణ పడి ఉంటానన్నారు ఆ పార్టీ సీనియర్ నాయకుడు జీవీ ఆంజనేయులు. క్లిష్టమైన పరిస్థితులు నెలకొన్నప్పటికీ తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడం జీవితాంతం గుర్తుపెట్టుకుంటానన్నారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల యంలో అభ్యర్థులకు బీ ఫారాలు అందజేసిన చంద్రబాబు రాష్ట్ర పునర్ని ర్మాణం కోసం కృషి చేయాలని వారందరిలో ప్రమాణం చేయించారు. ఎన్నికల్లో అనుసరిం చాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగానే వినుకొండ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు కూడా చంద్రబాబు చేతుల మీదుగా బీ ఫారం అందుకున్నారు. చంద్రబాబు ఆశీర్వాదం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జగన్ అరా చక పాలనపై నెలకొన్న ఏవగింపే ఈ ఎన్నికల్లో తమను విజయం వైపు నడిపించ బోతున్నాయని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో త్వరలోనే అడుగుపెట్ట బోతున్నామని జీవీ తెలిపారు.

రౌడీయిజం రాజ్యమేలుతుంది : బ్రహ్మారెడ్డి

విశాలాంధ్ర-దుర్గి: రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని విస్మరించి రౌడీయిజం రాజ్యమేలుతుందని మాచర్ల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అడిగొప్పల గ్రామంలో ఆదివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. 4సార్లు పిన్నెల్లిని గెలిపిస్తే మాచర్లలో అభివృద్ధి శూన్య మన్నారు. గూండాయిజం మాచర్లలో రాజ్యమేలుతుందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం టీడీపీ మెనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టారని వివరించారు. ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఇంటింటికి సూపర్ సిక్స్ పథకాలు అమ లుకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. తమ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తు పై వేసి ఎమ్మెల్యేగా నాకు, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలను అఖండ విజయం అందించాలని ఆయన ప్రజలను కోరారు. తొలత గ్రామంలో ప్రవేశించిన బ్రహ్మారెడ్డికీ నాయకులు, ప్రజలు ఘన స్వాగ తంతో బ్రహ్మారం పట్టారు. ఈకార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు, మేకల అనిల్, నాగెండ్ల శివ, కర్ణం వెంకయ్య, యాగంటి నరేష్, వెంకటేశ్వర్లు, నలబోతు అప్పారావు, వెంకటేశ్వర్లు, జానికీరామయ్య, దారా రాఘవరావు, అచ్చయ్య, తక్కెళ్ళపాటి పెద్దబాయి, మేకల అబ్రహం, మాచర్ల మదార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్ళు దగ్ధం

- రూ.5లక్షల ఆస్తి నష్టం

విశాలాంధ్ర-రొంపిచర్ల: విద్యుత్ షాట్ సర్క్యూట్ వలన రెండు పూరిళ్ళు దగ్ధమైన సంఘటన మండలంలో అన్నవరం గ్రామంలో ఆదివారం జరిగింది. దీనికి సంబంధించి సేకరించిన వివ రాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామం లో ఎస్సీ కాలనీలో నివాసముంటున్న పోలెపోగు పిచ్చయ్య, అతని కుమారుడు జాన్ లకు చెందిన రెండు పూరిళ్ళు విద్యుత్ షాట్ సర్క్యూట్ వలన పూర్తిగా దగ్ధమైనాయి. ఆ సమయంలో రెండు పూరిళ్ళల్లో ఉన్న గ్యాస్ సిలిండర్లు పేలటం వలన పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. మంటలు ఆర్పటానికి ఎవరూ సాహసించలేదు. సంఘటన జరిగిన సమయంలో ఇళ్ళల్లో ఎవరూ లేకపోవటం వలన ప్రాణనష్టం జరగలేదు. అనంతరం సమాచారము తెలుసుకున్న నరసరావు పేట అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకు రావడం జరిగింది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఈ ప్రమాదంలో సుమారు 5లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో రెండు పూరిళ్ళల్లో రు.1.50 లక్షల రూపాయల నగదు, 5 సవర్ల బంగారం, మిర్చి బస్తాలు, విలువైన వస్తువులు, సామాన్లు, దుస్తులు అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం అందుకున్న నరసరావుపేట శాసనసభ్యులు, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12, 13 వార్డుల్లో ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-గురజాల: గురజాల పట్టణంలోని 12, 13 వార్డుల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో మాజీ మంత్రి, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ 1947 నుండి 2019 వరకు దాదాపు 72 సంవత్స రాలలో గురజాల నియో జకవర్గంలో 5లక్షల జనాభాకి కేవలం 30పడకల ఆసుపత్రి మాత్రమే ఉండేది అని కానీ 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గానికి రూ.500కోట్లతో 600పడకల ఆసుపత్రి మంజూరు చేయించడం జరిగింది అని, రానున్న 6నెలల్లో ఆసుపత్రి పూర్తిగా అందుబాటులోకి వస్తుంది అని ఇది కాదా అభివృద్ధి అని కాసు అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, సీని యర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మున్సిపల్ చైర్మన్ పోలు వీరారెడ్డి, వైస్ చైర్మన్లు షేక్ బడేజాని, మాజీ ఎమ్మెల్సీ టీజీవి కృష్ణారెడ్డి, వార్డు ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నంబూరి శంకర్రావు నామినేషన్

విశాలాంధ్ర-పెదకూరపాడు: నియోజక వర్గ వైసీపీ అభ్యర్థి నంబూరి శంకర్రావు నామినేషన్ పెద్దకూర పాడులో ఈనెల 22వ తేదీన పెదకూరపాడు తహసీ ల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈద సాంబిరెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాంబిరెడ్డి మాట్లాడుతూ నియోజవర్గ పరిధిలోని అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ నియోజవర్గ ప్రజలు ఈ నామినేషన్ కార్యక్రమానికి వేలాదిగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల వైసీపీ కన్వీనర్ మస్తాన్ షరీఫ్, శ్రీనివాస్‌రెడ్డి, వెల్లలచెరువు సురేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఇరు పార్టీల వాగ్వివాదం

- సర్ది చెప్పిన పోలీస్ అధికారులు

విశాలాంధ్ర-బెల్లంకొండ : కూటమి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి రాణి రుద్రమదేవి ప్రచారాన్ని అడ్డగించే ప్రయత్నాలుచేసిన సంఘటన ఆదివారం రాత్రి 7:30 గంటల సమయంలో నాగిరెడ్డి పాలెం గ్రామంలో చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీ ఎంపీకి సంబంధించిన ప్రచారాన్ని అడ్డగించే ప్రయత్నాలు చేసి వారి ఎన్నికల ప్రచార వాహనాలు రోడ్డుకు అడ్డంగా పెట్టి ప్రచారాన్ని కొనసాగనీయ కుండా చేసే ప్రయత్నంలో టీడీపీ, వైసీపీవర్గాల వారికి కొద్దిపాటి తోపులాట, వాగ్వివాదం నెలకొంది. పోలీసులు రాకతో వివాదాన్ని సద్దుమణిగించే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

రెంటచింతలలో పెరిగిన దొంగతనాలు

విశాలాంధ్ర-రెంటచింతల: తీర్థయాత్రకు ఊరెళ్ళిన దంపతుల ఇంటిలో దొంగలు పడి నగదు, వెండి సామాను దోచుకెళ్లిన సంఘటన మండల కేంద్రమైన రెంటచింతలలో ఆదివారం ఉదయం వెలుగు చూసింది. రెంటచింతల నడి ప్రదేశంలో లూర్థుమాత గుడి సమీపంలో నివసిస్తున్న గుండా రమేష్ తీర్థయాత్రకు తిరుపతి పుణ్యక్షేత్రానికి ఈనెల 18వ తేదీ సాయంత్రం భార్య సత్యవతి, కుమారుడుతో కలిసి వెళ్లాడు. తిరుపతిలో స్వామి దర్శనం చేసుకుని వారు శనివారం రాత్రి బయలుదేరగా, వారి ఇంటి తాళాలు పగలగొట్టబడ్డాయని తన ఇంటి వద్ద నివసిస్తున్న వారి నుంచి వారికి ఫోన్లో సమాచారం రాగా దంపతులు భీతిల్లారు. ఆదివారం ఉదయం ఇంటికి చేరుకున్న వారికి తమ ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 70 వేల నగదుతో పాటు, కేజీ వెండి సామాన్లు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. ఇంటిలో జరిగిన చోరి విషయం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఇంటి పరిసరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఇదే రీతిలో గత సంవత్సరం రెంటచింతల లోని వడ్డెర బావి సమీపంలో నివసిస్తున్న వ్యక్తి ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారు ఆభరణాలు దోచు కెళ్లిన సంఘటన జరిగింది. ఎవరైనా ఊరు వెళ్ళినప్పుడు పోలీసులకు సమాచారం అంద జేస్తే వారి ఇంటి భద్రతకు చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు.

భాష్యం ప్రవీణ్ విజయాన్ని కాంక్షిస్తూ బైక్ ర్యాలీ

విశాలాంధ్ర-అమరావతి: పెదకూరపాడు నియోజవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం మండల కేంద్రమైన అమరావతిలో అమర లింగేశ్వర స్వామి దేవాలయం నుండి అమరావతి బస్టాండ్ వరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని బైకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందాలి అంటే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, భాష్యం ప్రవీణ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ర్యాలీ నిర్వహించారు.

శ్రీ నాగమల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

%విశాలాంధ్ర - వినుకొండ : శ్రీ భ్రమర టౌన్షిప్ జేనిత్ సిటీలో గంగ భ్రమరాంబ సమేత శ్రీ నాగమల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మండలంలోని శ్రీ భ్రమరా టౌన్‌షిప్ జేనిత్ సిటీలో గంగ భ్రమరాంబ సమేత శ్రీ నాగమల్లేశ్వర స్వామి, గణపతి, కాలభైరవ, నవగ్రహా, వీరభద్ర, భద్రకాళి, వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి, ధ్వజ, ఆలయ గోపర శిఖర యంత్ర, విగ్రహా ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం నుండి గుండెపూడి నాగరాజ శేఖర శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలలో శ్రీ భ్రమరా టౌన్షిప్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ గళ్ళ రామచంద్ర రావు, గుంటూరు పశ్చిమ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గళ్ళ మాధవి, భ్రమరా టౌన్షిప్ డైరెక్టర్ లక్ష్మీపతి రాజు, శ్రీ భ్రమరా అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సుజిని రామోహన్‌రావు, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ సర్కిల్ వ్యవస్థాపకులు డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య ,అచ్యుత గురునాథం సముద్రాల విజయ్ కుమార్, ఎస్ వి కోటేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

22న యరపతినేని నామినేషన్



విశాలాంధ్ర-పిడుగురాళ్ల : 22వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంట లకు గురజాల ఆర్డీఓ ఆఫీసులో కూటమి ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆదివారం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. గురజాల నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో, అభిమానంతో గురజాల నియోజకవర్గం నుంచి ఏడవసారి పోటీ చేయనున్నట్లు తెలిపారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికలు గురజాల నియోజకవర్గ భవిష్యత్తుకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికలు అన్నారు. సోమవారం జరిగే నామినేషన్ కార్యక్రమానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున పాల్గొని ఆశీస్సులు అందజేయాలన్నారు.

164 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరు

విశాలాంధ్ర-దుర్గి : 2024-25 సంవత్సరానికి ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించారు. దుర్గి ఏపీ మోడల్ స్కూల్లో 179 మంది విద్యార్థులు ధరఖాస్తు చేయగా 164 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. హాజరైన విద్యార్థుల బేసిక్ నాలెడ్జి ప్రకారం జిల్లా కార్యాలయం నుంచి ఎంపిక జాబితా వస్తుందన్నారు. మే నెలలో అడ్మిషన్లు జరుగుతాయని, జూన్ నెల నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

వార్డుల్లో దూసుకుపోతున్న కాసు ప్రచారం

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : ఎన్నికల సమయం దగ్గర పడటంతో పట్టణంలో ప్రచారాన్ని కాసు మహేష్‌రెడ్డి ముమ్మ రం చేశారు. ఇప్పటికే పట్టణంలోని పలు వార్డులలో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి ప్రచారానికి విశేష స్పందన లభిస్తుంది. మహిళలు హారతులిస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. అందరికీ సంక్షేమ పథకాలు అందయా లేదా అన్నవిషయం ఆరాతీస్తున్నారు. రానున్న కాలంలో పట్టణాన్ని సుందరీ కరణకి ప్రణాళికల రూపొందించుకున్నామని ప్రజలతో తెలుపుతున్నారు. మే 13న జరగనున్న ఎన్నికలలో అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

ట్రాక్టర్‌తో సహా వరిగడ్డి దగ్ధం

విశాలాంధ్ర-కారంపూడి : మండలంలోని మిర్యాల గ్రామంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన బత్తుల శ్రీనివాసరావుకు చెందిన ట్రాక్టర్‌తో సహా వరిగడ్డిని వైసీపీ పార్టీకి చెందిన వ్యక్తులు దగ్ధం చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలోని బీసీ సోదరులందరూ కలిసి టీడీపీ నేత ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని గ్రామ ంలో ఘనస్వాగతం పలకటంతో టీడీపీకి వస్తున్న మద్దతును చూసి ఓర్వలేక అధికార వైసీపీ నేతలు నోరులేని పశువుల కోసం ఏర్పాటు చేసుకున్న వరిగడ్డి దగ్ధం చేయటం హీనమైన చర్య అని మాజి ఉప ఎంపీపీ కర్ణ అమర సైదారావు అన్నారు. రౌడీరాజ్యం అంతరించి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగపాలన రావాలన్న పల్నాడు ప్రాంతం ప్రశాంతంగా ఉండాలన్న వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యరిని జూలకంటి బ్రహ్మారెడ్డిని గెలిపించుకో వాలని తెలియజేశారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెదకూరపాడు : పెదకూరపాడు మండలం పరిధిలోని లింగంగుంట్ల గ్రామంలో నియోజవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సౌమిత్ చౌదరి ఆధ్వర్యంలో ప్రముఖ అత్యాధునిక కంటి డాక్టర్లచే ఆర్థిక స్తోమత లేని కంటి సమస్య ఉన్న పేద ప్రజలకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 350 మందికి కంటి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 175 మందికి కంటి అద్దాలు అందజేసినట్లు ప్రముఖ మల్టీస్పెషల్టీ, హాసిని హాస్పిటల్ డాక్టర్ రహీం భాష చెప్పారు. తన సొంత ఖర్చులతో శిబిరాన్ని ఏర్పాటు చేసిన సౌమిత్ చౌదరి మాట్లాడుతూ చుట్టు పక్కల గ్రామాలలో ప్రాంతాల్లో అనేక మంది పేద ప్రజలు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు చూసి చెల్లించిపోయిన చౌదరి సొంత ఖర్చులతో ఉచిత కంటి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల కొంతకాలం నుంచి చౌదరి ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. చుట్టుపక్కల ప్రాంతాల్లోని పేద వర్గాల ప్రజలకు ఎంతో మందికి కులాల మతాల కతీతంగా పేదలకు ఆర్థిక సహాయం అందించారు. చౌదరి టీం అభిమానులు కంటి పరీక్షలు హాజరైన వారికి ఎలాంటి అవంతరాలు లేకుండా వసతి కల్పించారు. వచ్చిన పేషెంట్లకు అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువ నాయకులు పాల్గొని సేవలు అందించారు.

టీడీపీకి బీసీ సంఘాల మద్దతు

పెమ్మసాని ఆధ్వర్యంలో చంద్రబాబును కలిసిన బీసీ నాయకుడు కేశన శంకర్రావు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఎన్డీఏ కూటమికి బీసీ సంఘాల మద్దతు అందిస్తామని రాష్ట్ర బీసీ నాయకుడు కేశన శంకర్రావు చెప్పారు. టీడీపీ జాతీయ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గారి ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ నాయకుడు కేశన శంకర్రావు మర్యాదపూర్వకంగా ఆది వారం కలిశారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ బీసీ సంఘాల సమస్యలను పరిష్కరించాలని చంద్రబాబును కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు న్యాయం చేసేలా పనిచేస్తామని బాబు గారు సందర్భ ంగా మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలను ఏకం చేసి త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో విజయం చేకూరేలా పని చేస్తామని శంకర్రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు రాష్ట్రంలోని పలువురు బీసీ సంఘం నాయకులు కూడా పాల్గొన్నారు.